నమస్తే తెలంగాణ
నల్లగొండ, ఆదివారం 9 మార్చి 2025
SUNDAY, MARCH 9, 2025

రాజీ పద్ధతిలో కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

● జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు

రామగిరి, మార్చి 8: కక్షిదారులు తమ కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ దోహదం చేస్తాయని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. నల్లగొండ కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. లోక్ అదాలత్‌తో 40సివిల్ , 5,807 క్రిమినల్, 95 మోటర్ వాహన బీమా కేసులు, 3 బ్యాంక్, 29 సైబర్ క్రైమ్ కేసులు, 100 విద్యుత్, 12879 ట్రాఫిక్ చాలాన్ కేసులు మొత్తం 18, 953 కేసులు పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరిగిరి వెంకట్‌రెడ్డి, న్యాయమూర్తులు సంపూర్ణ, ఆనంద్, రోజామణి, దుర్గప్రసాద్, కవిత, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి, లాయర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి భాస్కర్‌రావు పరామర్శ

ఎల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వేములపల్లి, మార్చి 8: మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు నక్క నాగరాజు తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు శనివారం వారి ఇంటికి వెళ్లి ఎల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు అన్నబోయిన నాగార్జునాచారి, మజ్జిగపు సుధాకర్‌రెడ్డి, కట్టా మల్లేశ్‌గౌడ్, గౌరు శ్రీనివాస్, కాట్రగడ్డ రాజగోపాల్‌రావు, బంటు రాము ఉన్నారు.

పెండింగ్ డీఏ, పీఆర్‌సీని తక్షణమే విడుదల చేయాలి

పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మోహన్‌రావు

పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

రామగిరి, మార్చి 8: ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన 5 డీఏలు, పీఆర్‌సీని తక్షణమే ప్రకటించి విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బి.మోహన్‌రావు, నల్లగొండ మండల యూనిట్ అధ్యక్షుడు గజవెల్లి సత్యం డిమాండ్ చేశారు. నల్లగొండలోని పెన్షనర్స్ భవనంలో శనివారం నిర్వహించిన మండల యూనిట్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి సంవత్సరం దాటినీ నేటికీ పరిష్కారానికి నోచలేదన్నారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళాలను, శనివారం పుట్టిన రోజు జరుపుకొన్న పెన్షనర్స్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి యాద వాసుదేవ్, జిల్లా, మండల నాయకులు జెల్లా పుల్లయ్య, సుధాకర్, కేశవాచారి, బాలరాజు, పిచ్చమ్మ, లావణ్య, ఎలిజబెత్ పాల్గొన్నారు.

యోగా గురువు జ్యోతికి అవార్డు

జ్యోతికి అవార్డు అందిస్తున్న సినీ నటుడు సుమన్

రామగిరి, మార్చి 8: నల్లగొండకు చెందిన యోగా గురువు, స్వచ్ఛంద సేవకురాలు జినుగు జ్యోతిరెడ్డికి పాన్ ఇండియా అసోసియేషన్ ఇన్‌స్పైరింగ్ ఉమెన్ అవార్డు అందించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియంలో జరిగిన ప్రపంచ మహిళా దినోత్సవం కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణు గోపాచారి, సినీ హీరో సుమన్, సినీ నటి దివ్యవాణి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు.

డీ-40 కాల్వ ద్వారా సాగునీరు అందించాలి

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుధాకర్‌రెడ్డి

మలపరాజుగూడెంలో ఎండిపోతున్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మాడ్గులపల్లి, మార్చి 8: డీ-40 కాల్వ ద్వారా సాగునీరు అందించి చివరి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఇందుగుల పరిధిలోని మల పరాజుగూడెంలో నీరందక ఎండిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఎకరానికి రూ.30వేలు ఖర్చు చేసి సాగు చేస్తే పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. డీ-40 కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయక పోవడంతో కొత్తగూడెం, గుర్రప్పగూడెం, ఇందుగుల, మలపరాజుగూడెం, సీత్యా తండా గ్రామాల్లో రైతుల వరి పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పుల్లెంల శ్రీకర్, పతాని శ్రీను, అంజయ్య, జూకూరి నాగయ్య ఉన్నారు.

ఏకలవ్య స్కూల్లో 16న ప్రవేశ పరీక్ష

మిర్యాలగూడ, మార్చి 8: రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అవంతీపురం గిరిజన సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ బి.జానునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను మార్చి 7 నుంచి సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

ప్రకటన

నా క్లయింట్ దుస్సా రాజేశ్వరి, తండ్రి దుస్సా అంజయ్య, వయస్సు: 45 సం.లు, వృత్తి: ప్రభుత్వ ఉద్యోగి, నివాసం: నకిరేకల్ గ్రామము మరియు మండలము, నల్లగొండ జిల్లా, గారు ఇచ్చు ప్రకటన ఏమనగా! నా ఇంటి ప్లాట్ యొక్క విక్రయ దస్తావేజు నెం.8136/2010, Dated: 12-08-2010, SRO- Nalgonda ద్వారా కొనుగోలు చేసినాను. దానియొక్క ఒరిజినల్ విక్రయ దస్తావేజు నెం.8136/2010, DEO Office నుండి మా ఇంటికి ఆటోలో వెళ్ళుచుండగా మార్గమధ్యలో పోయినవి. కావున ఇట్టి విషయము నల్లగొండ పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చినారు. సదరు ఆస్తి యొక్క వివరములు a Residential Flat Bearing No.105, in First Floor in Kancharla Towers having 782.00 Sq.feets super built up area within Sy.No.447, undivided share of land admeasuring 44.00 Sq.yards=36.78 Sq.mtrs. out of 2420.00 Sq.yards=1856.14 sq.mtrs, with in GOLLAGUDA Revenue Village, Mandal & Dist Nalgonda and aforesaid property bounded by

Flat No.105 bounded by

North: Open to sky, South: 10:00 Wide Road, East: 6'6" Wide Corridor & Entrance, West: Open to Sky,

Boundaries of entire complex:

North: Agri Land of V.Deepika, South: Agri. Land of Others, East: Agri.Land of Others, West: Road

ఎవ్వరికైనను పై దస్తావేజు దొరికినచో నా క్లైంటుకు తిరిగి ఇవ్వగలరు. ఇట్టి విషయంపై ఎవ్వరికైనను ఎటువంటి అభ్యంతరమునచో తగిన ఆధారములతో (7) వారం రోజులలో ఈ క్రింది తెలిపిన అడ్రస్‌లో సంప్రదించగలరు.

సం/- **నాంపల్లి చంద్రశేఖర్**
న్యాయవాది & నోటరీ
ఇంటి నం.6-2-439/1, శ్రీనగర్ కాలనీ,
నల్లగొండ-508001, తెలంగాణ,
సెల్: 9440422393

నల్లగొండ
తేదీ:08-03-2025

తాళం వేసిన ఇంట్లో చోరీ

చందంపేట, మార్చి 8 : తాళం వేసిన ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన ఘటన శనివారం చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రియాల గ్రామానికి చెందిన అప్పల చిన్న జయమ్మ శనివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో బీరువాలో ఉంచిన బంగారు పుస్తెలతాడు చోరీకి గురి కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మిర్యాలగూడ : కేఎల్ఎన్ జూనియర్ కళాశాలలో మహిళా అధ్యాపకులను సన్మానించిన లయన్స్‌క్లబ్ సభ్యులు

నకిరేకల్ : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, మహిళలు

కట్టంగూర్‌లో మహిళా సంఘాల సభ్యులను సన్మానిస్తున్న మాజీ ఎంపీపీ వెంకటమ్మ

నల్లగొండలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

ఘనంగా మహిళా దినోత్సవం

రామగిరి, మార్చి 8: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వివిధ సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. సమాజంలో మహిళల స్థానం ఎంతో గొప్పదని, వారు వివిధ రంగాల్లో అందిస్తున్న సేవలను కొనియాడారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు మహిళలకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశాయి.

రామగిరి : లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఎలైట్ ఆధ్వర్యంలో మహిళాలను సన్మానించిన బాధ్యులు

హాలియా పోలీస్ స్టేషన్‌లో మహిళ సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఐ సతీశ్‌రెడ్డి

నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి స్వప్నను సన్మానిస్తున్న కోర్టు సిబ్బంది

త్రిపురారం : మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

శాలిగౌరారంలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి మండల కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

చిట్యాల : పట్టణంలోని 7వ వార్డులో కేక్ చేస్తున్న మహిళలు

ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐల బదిలీ

నీలగిరి, మార్చి 8 : నల్లగొండ జిల్లాలో ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలను బదిలీ చేస్తూ తెలంగాణ మల్టీజోన్-2 ఐజీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మిర్యాలగూడ రూరల్ సీఐగా పనిచేస్తున్న వీరబాబు, మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ నాగార్జునను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు. వీఆర్‌లో ఉన్న పీఎన్‌డీ ప్రసాద్‌ను మిర్యాలగూడ రూరల్‌కు, మోతీరామ్‌ను వన్‌టౌన్‌కు, జి.సత్యనారాయణను టూటౌన్‌కు కేటాయించారు. వాడపల్లి ఎస్ఐని వీఆర్‌కు అటాచ్ చేసి ఆయన స్థానంలో హైదరాబాద్ నుంచి వచ్చిన శ్రీకాంత్‌రెడ్డిని, మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లోకేశ్‌ను వీఆర్‌కు అటాచ్ చేసి ఆయన స్థానంలో లక్ష్మయ్య, నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజును వీఆర్‌కు అటాచ్ చేసి ఆయన స్థానంలో ఎర్రం సైదులును కేటాయించారు.

రోడ్డు ప్రమాద బాధితురాలికి రూ.11 లక్షల పరిహారం

బాధితురాలికి పరిహారం కాపీని అందిస్తున్న జడ్జి వేణు

మిర్యాలగూడ, మార్చి 8: పట్టణంలోని కోర్టు సముదాయంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో రోడ్డు ప్రమాద బాధితురాలి కేసును విచారించిన ఐదవ అదనపు జిల్లా జడ్జి, అదాలత్ చైర్మన్ జి.వేణు బాధితురాలికి రూ.11లక్షల పరిహారం చెల్లించాలని అవార్డు జారీ చేశారు. దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన ధీరావత్ మీనాను వాడపల్లి వద్ద లారీ ఢీకొని చేతి మీదుగా వెళ్లడంతో ఆమె చేతిని పూర్తిగా తొలగించారు. ఈ కేసు కోర్టులో నడుస్తున్నది. లోక్‌అదాలత్‌లో ఇన్సూరెన్స్ అధికారులను పిలిపించి పరిహారం చెల్లించాలని కోరడంతో వారు రూ.11లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి వేణు మాట్లాడుతూ మిర్యాలగూడలోని మూడు కోర్టుల్లో న్యాయాధికారులు లేని కారణంగా పూర్తి స్థాయిలో లోక్‌అదాలత్ నిర్వహించలేక పోతున్నామని, అయినా ఆయా కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సుజయ్, రెండవ స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ శ్రీదేవి, ఏపీపీ ఎ దీపారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎండీ. ఇబ్రహీం, కోశాధికారి పవన్‌కుమార్, స్పెషల్ ఏజీపీ శ్రీధర్‌గౌడ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

తాను మరణించినా నలుగురికి ప్రాణదానం

సందీప్‌కుమార్(ఫైల్)

మిర్యాలగూడ, మార్చి 8: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలను కుటుంబ సభ్యులు జీవన్‌దాన్ సంస్థ అందించి మరో నలుగురికి ప్రాణదానం చేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పిట్టల సందీప్‌కుమార్(25) గత ఆదివారం పెద్ద పూర నుంచి హాలియా వైపు బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా శుక్రవారం బ్రెయిన్ డెడ్ అయ్యాడు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు సందీప్ కుటుంబ సభ్యులను ఒప్పించి అతడి గుండె, కిడ్నీలు, కాలేయం, కార్నియాను సేకరించారు. ఎల్‌బీ నగర్ కామినేని ఆస్పత్రి నుంచి గుండెను గ్రీన్ చానల్ ద్వారా మెట్రో రైల్‌లో సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించి అక్కడ చికిత్స పొందుతున్న మరో వ్యక్తికి అమర్చారు. అవయవ దానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను వైద్యులు అభినందించారు. మృతుడు సందీప్‌కుమార్‌కు ఏడాది క్రితమే వివాహం కాగా రెండు నెలల కుమారుడు ఉన్నాడు.

మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెర్కు లింగంగౌడ్

మర్రిగూడ, మార్చి 8 : ఎన్నికల సందర్భంగా మహిళలకు అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు చెర్కు లింగం గౌడ్ విమర్శించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం కింద రూ.2500, వితంతువులకు రూ.4వేల పింఛన్, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ముఖం చాటేశారన్నారు. మహిళలకు రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పండుగకు కనీసం బతుకమ్మ చీరలు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మహిళలను అవమానించిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం మహిళాంక్షేమానికి అనేక పథకాలు అమలు చేసిందన్నారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆస్తి పన్ను బకాయిలపై రాయితీ ఇవ్వాలి : సీపీఎం

సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ సలీం

రామగిరి, మార్చి 8: గ్రేటర్ హైదరాబాద్ తరహాలో నల్లగొండ మున్సిపాలిటీకి కూడా ఆస్తి పన్ను బకాయిలపై వన్ టైం సెటిల్మెంట్ కింద 90శాతం వడ్డీ రాయితీ ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ.సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను చెల్లించే వారికి వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల పన్నులు పూర్తిస్థాయిలో వసూలై మున్సిపాలిటీలకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో ఆస్తి పన్ను బకాయిలు ఉన్నాయని, వాటి వసూళ్ల కోసం ఈ రాయితీ స్కీం ఉపయోగపడుతుందని తెలిపారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, కోట్ల అశోక్‌రెడ్డి, గాదే నరసింహ, భూతం అరుణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నందికొండ, మార్చి 8 : నాగార్జునసాగర్‌లోని రోడ్డుపై శుక్రవారం మద్యం మత్తులో అపస్మారక స్థితిలో పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ వ్యక్తిని పోలీసులు స్థానిక కమలానెహ్రూ ఏరియా దవాఖానకు తరలించారు. సదరు వ్యక్తి చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు సాగర్ సీఐ బీసన్న తెలిపారు. అతడి ఒంటిపై బ్లూ గీతల చొక్కా, బ్లూ కలర్ లోయర్ ఉందని పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రి మర్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు విజయపురిటౌన్ పోలీస్ స్టేషన్‌లో తెలుపాలని సూచించారు.

10 నుంచి ఇంటర్మీడియట్ పేపర్ వాల్యుయేషన్: డీఐఈఓ

రామగిరి, మార్చి 8: ఇంటర్మీడియట్ పరీక్ష పత్రాల మూల్యాంకనం ఈ నెల 10 నుంచి ప్రారంభం కానుందని, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డీఐఈఓ దఫ్రూనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 10న సంస్కృతం పేపర్ మూల్యాంకనం ప్రారంభమవుతుందని, మిగిలిన సబ్జెక్టులు ఈ నెల 20, 22, 26న ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. బోర్డు ఆదేశాల మేరకు పటిష్టంగా మూల్యాంకన ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. మూల్యాంకన ఉత్తర్వులు అందుకున్న అధ్యాపకులను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ విధిగా రిలీవ్ చేయాలని ఆదేశించారు.

ఆర్థిక సాయం

కేతేపల్లి, మార్చి 8 : మండలంలోని కొత్త పేట గ్రామానికి చెందిన పసుపులేటి మహేశ్వర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం ఇబ్బందులు పడుతుండడంతో గ్రామానికి చెందిన నేస్తం స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం రూ.22,500, క్వింటా బియ్యాన్ని మహేశ్వర్ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బుర్రి సురేందర్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ పల్నాటి సుధాకర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

దర్వేశిపురం ఆలయం వద్ద షాపుల నిర్వహణకు టెండర్లు

నల్లగొండ సిటీ, మార్చి 8: కనగల్ మండలం దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం వద్ద దుకాణాల నిర్వహణకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాల సేకరణ, వాహనాలకు బొట్లు, కొబ్బరి చిప్పల సేకరణ, చీరలు, ఒడి బియ్యం సేకరణకు టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 10న మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ ఆవరణలో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాల ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్యేకు వీడియో కాల్‌పై కొనసాగుతున్న దర్యాప్తు

నకిరేకల్, మార్చి 8 : నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్ కాల్ చేసిన సైబర్ నేరగాళ్ల విషయమై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేకు న్యూడ్ వీడియో కాల్ మధ్యప్రదేశ్ నుంచి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ లచ్చిరెడ్డి, ఇద్దరు కానిస్టేబుళ్లు మధ్యప్రదేశ్ రాజధాని ఇండోర్‌కు వెళ్లారు. అక్కడి పోలీసుల సాయంతో సైబర్ నేరగాళ్ల కోసం రెండో రోజు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం వెల్లిన పోలీసు బృందం శనివారం కొంత సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో సైబర్ నేరగాళ్లను గుర్తించి అరెస్ట్ చేసే అవకాశాలున్నట్లు సమాచారం.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

చిట్యాల, మార్చి 8 : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై శనివారం స్థానిక మండల పరిషత్ ఆవరణలో 15వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీలో గుర్తించిన లోటుపాట్లపై అధికారులు చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో వేతనాల కింద రూ.2.25 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ నవీన్, సూపరింటెండ్ మనోహర్, ఎంపీఓ కృష్ణయ్య, ఏపీఓ శ్రీలత పాల్గొన్నారు.

అవగాహనతో ఎయిడ్స్ నిర్మూలన సాధ్యం

మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

త్రిపురారం, మార్చి 8: అవగాహనతోనే ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం సాధ్యమని త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఆర్‌జీ కేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఎయిడ్స్‌పై అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి కళా బృందం వారు కళా ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. ఈ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డీఆర్‌పీ నర్సింహాచారి, గాయత్రి, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

చిట్యాల, మార్చి 8 : వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రత పెరుగుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి ప్రజలు తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య అన్నారు. శనివారం చిట్యాల పట్టణంలోని మల్లన్న గుట్ట ప్రాంతంలోని ప్రజా సమస్యలపై ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వే సందర్భంగా ఆయన మాట్లాడారు. మల్లన్న గుట్ట ప్రాంతంలో మంచినీటి బోరును ప్రైవేటు వ్యక్తులు తమ ఆధీనంలో ఉంచుకున్నారని, దాంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, పట్టణ కార్యదర్శి బొబ్బిలి సుధాకర్‌రెడ్డి, శాఖ కార్యదర్శి అయితరాజు యాదయ్య, నాయకులు మాదరబోయిన వెంకన్న, బద్దుల రమేశ్, గణేశ్, శ్రీహరి పాల్గొన్నారు

కటింగ్ షాపు నిర్వాహకుడిపై కాంగ్రెస్ నాయకుడి దాడి

● పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

దాడిలో గాయపడిన మహేశ్

కేతేపల్లి, మార్చి 8 : మండల పరిధిలోని కొప్పోలు గ్రామానికి చెందిన కటింగ్ షాపు నిర్వాహకుడిపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడికి దిగారు. అయితే పోలీసులు మాత్రం ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నెమ్మికంటి మహేశ్ కటింగ్ షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదు రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కప్పల సైదులు, తన సన్నిహితులతో కలిసి మహేశ్ కటింగ్‌షాపు వద్దకు వెళ్లాడు. వారు దుకాణంలో మద్యం సేవించేందుకు సిద్ధమవుతుండగా.. రాత్రి కావడంతో తాను ఇంటికి వెళ్తున్నానని, తన దుకాణంలో మద్యం సేవించవద్దని చెప్పాడు. దాంతో సైదులు మహేశ్‌ను తోసేశాడు. దాంతో అతను తన దుకాణం వద్ద గల బండ రాళ్లపై పడి తీవ్రగాయాలయ్యాయి. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్ఐ శివతేజను వివరణ కోరగా ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం